ప్రజావాణికి సమస్యల వెల్లువ

- పరిష్కారం కోసం అర్జీదారుల ఎదురు చూపులు
- పదే పదే తిరుగుతున్న బాధితులు
- ఆర్జీల స్వీకరణే తప్ప.. సత్వర పరిష్కారం శూన్యం
- నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అధికారులతో వాగ్వాదం

శిశువు మృతికి కారణమైన ఎంసీహెచ్ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న పెద్దాపూర్ గ్రామానికి చెందిన పల్లె ప్రదీప్, కుటుంబ సభ్యులు

కలెక్టరేట్, ఆగస్టు 12: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. వారం వారం దరఖాస్తుల సంఖ్య పెరుగుతుండగా, అధికారుల నుంచి హామీలే తప్ప, పరిష్కార మార్గాలు కరువవుతున్నాయనే విమర్శలు అర్జీదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు ఫిర్యాదులను కిందిస్థాయి అధికారులకు కూడా పంపడంలో జాప్యం ప్రదర్శిస్తుండగా, సమస్యల సత్వర పరిష్కారం శూన్యంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వారం క్రమం తప్పకుండా వచ్చి అర్జీ అందజేసినా, తమకు మాత్రం న్యాయం జరుగడం లేదంటూ అనేక మంది వాపోతున్నారు. అధికారులు చెప్పే సమాధానాలకు సంతృప్తి చెందని వారు, ఉన్నతాధికారులతో వాగ్వాదానికి కూడా దిగుతున్నారు. అలాగే ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతుండడంతో, పోలీసులు వారిని ఆరుబయటకు లాక్కెళ్లడం షరామామూలైంది. ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందంటూ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయంటూ బాధితులు మండిపడుతున్నారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన పలువురి ఆవేదన వారి మాటల్లోనే..

దవాఖాన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

నిండు గర్భిణి అయిన నాభార్యను మాతాశిశు దవాఖానలో ప్రసవానికి తీసుకొస్తే, వైద్యులు పట్టించుకోకపోవటంతో గర్భంలోనే శిశువు మరణించింది. దీనిపై ఆందోళన చేస్తే నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పి, పంపారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా, వారిని విధుల్లో నుంచి తొలగించలేదు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వేలకు వేలు చెల్లించి ప్రైవేటు హాస్పిటళ్లలో చికిత్స చేయించే స్థోమత లేని మాలాంటి వారి కోసమైనా, ప్రభుత్వ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

-పల్లె ప్రదీప్, పెద్దాపూర్, జూలపల్లి మండలం

ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపులు భరించలేకపోతున్నం

జగిత్యాలలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపనీలో నాలుగున్నరేళ్ల క్రితం రూ.రెండు లక్షల గృహ రుణం తీసుకున్న. 26నెలల దాకా రుణం సక్రమంగానే చెల్లించా. తర్వాత నాభర్త ప్రమాదవశాత్తు పడి ఎడమచేయి విరగడంతో, దవాఖానల చుట్టూ తిరుగుతున్న. ఇదేమీ పట్టించుకోని ఫైనాన్స్ నిర్వాహకులు నా ఇల్లు వేలం వేస్తామంటూ, ఇంటికి నోటీసులు అతికించి వెళ్లారు. డబ్బులు చెల్లించాలంటూ అర్ధరాత్రి ఇంటికి వచ్చి హంగామా చేస్తున్నరు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే మాకు న్యాయం జరుగుతుందేమోననే ఆశతో వచ్చి, అర్జీ అందజేశాం.

-గడ్డం కనకమ్మ, బూర్గుపల్లి, గంగాధర మండలం

బీసీ విద్యార్థులకు వసతిగృహాల్లో అవకాశం కల్పించాలి

జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన ప్రతి విద్యార్థికి సంక్షేమ వసతి గృహాల్లో అవకాశం కల్పించాలి. వేలాది మంది నిరుపేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతూ, చదువులు కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నత చదువుల కోసం నిత్యం సుదూర ప్రాంతాల్లోని వారి గ్రామాల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వారికి అవకాశం కల్పిస్తే, మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలుమార్లు అధికారులకు సూచనలు చేస్తూ, వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. దీనిపై రాబోయే రోజుల్లో ఉద్యమం లేవదీస్తాం.

-కేశిపెద్ది శ్రీధర్‌రాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

భూమి మాదే అయినా.. ధరణిలో మాత్రం లేదు

26 క్రితం కొనుగోలు చేసి, సాదాబైనామా చేయించుకున్న మాభూమిని అక్రమంగా ధరణిలో బెజ్జంకి పుట్టయ్య అనే వ్యక్తి తన పేర నమోదు చేయించుకున్నాడు. వెంటనే తన కూతురి పేర రిజిస్ట్రేషన్ చేశాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు. పొలం దున్నుకునేందుకు వెళ్తున్న మాపై పుట్టయ్య కుటుంబీకులు దౌర్జన్యానికి దిగారు. హద్దురాళ్లు తొలగించి, మాభూమిని ఆక్రమించుకునే యత్నం చేస్తున్నారు. పొయిన నెల 22వ తేదీన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. ఇప్పటివరకు మాకు ఎలాంటి న్యాయం జరుగకపోవడంతో, తిరిగి మళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశాం.

-బలుసుల అశోక్, ఇరుకుల్ల, కరీంనగర్ రూరల్ మండలం

పెండింగ్‌లో ఉన్న సదరం డేటా పూర్తి చేయాలి

మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సదరం శిబిరం డేటాను పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలి. అధికారుల నిర్లక్ష్యంతో అర్హులైన దివ్యాంగులు కూడా సదరం సర్టిఫికెట్లు లేక ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందలేకపోతున్నారు. వెంటనే పరిశీలించి, అర్హులైన 300 పైచిలుకు దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందజేయాలి.

-జక్కం సంపత్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్

ప్రజాప్రతినిధి వేధింపుల నుంచి కాపాడాలి

రక్షణ కల్పించాలంటూ వేడుకుంటున్న శ్రీనివాస్, అతడి తల్లి రమాదేవిని బయటకు లాక్కెళ్తున్న పోలీసులు

అకారణంగా మా ఇంటిపై దాడికి పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్న 40వ డివిజన్‌లోని ప్రజాప్రతినిధి బారి నుంచి మా కుటుంబాన్ని కాపాడాలి. ఎలాంటి అనుమతుల్లేకుండా తన ఇంటిలోని చెట్లు నరికివేయడంపై పోలీసులకు ఫిర్యాదుచేస్తే, కాంప్రమైజ్ కావాలంటూ సూచిస్తున్నారు. నా తల్లిని కూడా దుర్భాషలాడుతూ కార్పొరేటర్ దంపతులు మాపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

-శ్రీనివాస్, గుండ్ల హన్మాన్ ఆలయ వీధి, కరీంనగర్

గిర్దావర్ నిర్లక్ష్యంతో పాస్‌బుక్ రాలేదు

నగునూర్ గ్రామంలోని 268ఈ సర్వే నంబర్‌లో గల ఎకరా రెండు గుంటల భూమి ధరణిలో నమోదైనా, నాకు ఇప్పటివరకు పట్టాదారు పాస్‌బుక్ రాలేదు. దీనిపై గిర్దావర్‌ను అడిగితే, తహసీల్దార్‌ను అడగాలంటడు. ఆయననడిగితే గిర్దావర్‌నే అడగాలంటడు. గట్టిగా నిలదీయడంతో గిర్దావర్ డబ్బులిస్తేనే నీకు పాస్‌బుక్ వస్తదంటూ చెబుతండు. అధికారులు న్యాయం చేస్తారని ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేసిన.

- బొంకోని పతి, నగునూరు, కరీంనగర్ రూరల్ మండలం

ఆలయాల్లో భక్తుల సందడి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 12 : జిల్లా కేంద్రంలోని శివాలయాల్లో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తుల సందడి నెలకొంది. పాతబజార్ గౌరీ శంకరాలయం, కమాన్‌రోడ్డు రామేశ్వరాలయం, ఆదర్శనగర్ రాజరాజేశ్వరాలయం, జడ్పీ క్వార్టర్స్‌లోని శివాలయంతో పాటు శివలింగాలున్న అన్ని ఆలయాల్లో సమీప ప్రాంతాల భక్తులు విశేష అభిషేక, అర్చనలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగించారు. నమక చమకాలు, రుద్ర సంబంధ స్తోత్రాలు, శివ నామస్మరణలు, భజనలతో ఆలయాలు మార్మోగాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఆగస్టు 12: నగరంలోని 33/11కేవీ సప్తగిరి కాలనీ సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళ వారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, తెలంగాణ చౌక్, కశ్మీర్ గడ్డ, ముకరంపుర, గోదాంగడ్డ, భగత్ నగర్, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రాంచంద్రాపూర్ కాలనీ, శివనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు డెయిరీ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

చిగురుమామిడి, ఆగస్టు 12: రేకొండ గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో సోమవారం పాల ఉత్పత్తిదారుల పిల్లల చదువులకు నెలవారీ స్కాలర్‌షిప్ అందజేశారు. ఏడుగురు విద్యార్థులకు గానూ రూ.800 చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ సూపర్‌వైజర్ చింతపుల నాగయ్య మాట్లాడుతూ, నాణ్యమైన పాలకు పేరుగాంచిన కరీంనగర్ డెయిరీ, పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో డెయిరీ అధ్యక్షుడు రాధారపు సంపత్ కుమార్, కార్యదర్శి భగత్, డైరెక్టర్లు నీల వెంకన్న, చందవేణి స్వామి, బోయిని అనిల్, వర్ణ శ్రీనివాస్ రెడ్డి, ఏరుకొండ రమేశ్, రాధారపు చిన్నకనకయ్య, చెంచల మొగిలి, రొంటాల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

తిమ్మాపూర్, ఆగస్టు 12: జిల్లాలోని ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్టా రవీంద్రాచారి డిమాండ్ చేశారు. మండలంలోని అలుగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సంఘ ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. డీఈడీ, బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పదోన్నతి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానందాచారి, విజ్జగిరి రవి, ఎలగూరి మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.

NT- 326217

సంపాదించుకోవచ్చు

★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.

NTK-311344

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మండల అధికారులతో ఆర్డీవో సమీక్ష

చిగురుమామిడి, ఆగస్టు 12: చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖలపై కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అలాగే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో ఖాజా మొయినొద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ

చిగురుమామిడి, ఆగస్టు 12: పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు బండ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలాధ్యక్షుడిగా జి. అజయ్, గౌరవాధ్యక్షుడిగా ఇనుకొండ వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కే రమేశ్, సీహెచ్ మౌనిక, వై రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. సంపత్, కోశాధికారి ఎస్. స్వర్ణలత, జాయింట్ సెక్రటరీగా బి. అరుణ్, పి. మంజుల, పి. శ్రీలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా కే రమేశ్, జి. సంపత్, పద్మావతి, స్వప్న, రాజేశ్వరరావు ఎన్నికయ్యారని వెల్లడించారు.

విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 12: విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలని సింగాపూర్ కిట్స్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ డాక్టర్ ఎంవీ సతీశ్ కుమార్ సూచించారు. ఎన్‌సీసీ తెలంగాణ 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కూల్ డానియోల్ లాట్‌జెమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం 'పర్సనాలిటీ డెవలప్మెంట్ అండ్ గోల్ సెట్టింగ్' అంశంపై డాక్టర్ ఎంవీ సతీశ్ కుమార్ మాట్లాడారు. విద్యార్థి దశలో నైపుణ్యం నేర్చుకోవాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా దానిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో కిట్స్ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రవీందరబాబు, డీసీ ఇన్‌చార్జులు మేజర్ సాగర్ సింగ్, జె. సూర్యప్రసాద్, హవల్దార్ వికాస్ కుమార్, గులాబ్ సింగ్, లెఫ్టినెంట్లు శ్రీలత, రాజు, ఐవో నవీన్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ తహసీల్దార్ మృతి

మానకొండూర్, ఆగస్టు 12: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కొండ్ర పోచయ్య (87) గుండెపోటుతో మృతి చెందారు. రెండు సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంగాధర, ఆగస్టు 12 : మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జనగం విద్యాసాగర్‌రెడ్డి ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి రాగా, తలుపు తెరిచి కనిపించాయి. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. 50 వేలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

టేలాల్లో దొంగతనాలు

శంకరపట్నం, ఆగస్టు 12 : మండలంలోని సైదాపూర్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి పూట రెండు టేలాల్లో దొంగతనాలు జరిగాయి. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఓ చికెన్ సెంటర్ టేలా తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ. 5 వేలు, అలాగే పక్కనే ఉన్న మరో హోటల్ టేలా తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.10 వేల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు జుననూర్ తిరుపతి, చిర్ర సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మండలంలోని మెట్‌పల్లి గ్రామ శివారులో వీణవంక మండలం జంగంపల్లి వైపు నుంచి వస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ రేగుల తిరుపతి సంబంధిత పత్రాలు చూపకపోకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ విరాళం

కొత్తపల్లి, ఆగస్టు 12 : ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని పోలీస్ అడిషనల్ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థి బోనాల కిషన్ స్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రూ.40వేల విలువైన కంప్యూటర్, రూ 12 వేల విలువైన ప్రింటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందంకు అందజేయగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

విద్యానగర్, ఆగస్టు 12 : పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ హత్య ఘటనను కరీంనగర్ ఐఎంఏ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు పొలాస రాంకిరణ్, వెంకట్‌రెడ్డి, సీనియర్ వైద్యులు జగన్‌మోహన్‌రావు, అలీం, కిషన్, లక్ష్మణ్, శేష శైలజ, ఝాన్సీ, మల్లికార్జున్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ బండారి రాజ్‌కుమార్‌తో పాటు తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీడీజీఏ), తెలంగాణ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. టీటీడీజీఏ అసోసియేషన్ కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ హరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఐఎంఏ అసోసియేషన్ నాయకులు, ప్రతిమ, చల్మెడ మెడికల్ కాలేజీలతోపాటు కరీంనగర్‌కు చెందిన డాక్టర్లు మంచిర్యాల చౌరస్తా నుంచి కోర్టు చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డెంటల్ అసోసియేషన్, గవర్నమెంటు డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ అసోసియేషన్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంతో స్ఫూర్తి

సారంగపాణి (ఫైల్)

వీణవంక, ఆగస్టు 12: మండల కేంద్రానికి చెందిన అయిత సారంగపాణి (66) నేత్రదానంతో స్ఫూర్తిగా నిలిచారు. సారంగపాణి సోమవారం ఉదయం ఆకస్మికంగా మృతిచెందడంతో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి డీలర్ గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, వీణవంక డీలర్ రామిడి శ్రీనివాస్, బాధిత కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలు సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు. ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన సారంగపాణి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డా.భీష్మాచారి, ప్రచారకార్యదర్శి వాసు అభినందించారు.

పోస్టాఫీసులో నషా ముక్త్ భారత్ అభియాన్

హుజూరాబాద్‌టౌన్, ఆగస్టు 12: పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో పోస్ట్ మాస్టర్ మహేందర్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారులు, తపాలా సిబ్బందితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే అల్ఫోర్స్ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తపాలా సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధన్గర్‌వాడీ పాఠశాలలో..

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 12 : జిల్లా కేంద్రంలోని ధన్గర్‌వాడీ పాఠశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, ఐసీడీఎస్ అధికారి శాంత, ఎంఈవో సంపత్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి సారించాలని చెప్పారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ అప్పగింత

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 12: పట్టణానికి చెందిన మొలుగూరి రేణుక సెల్‌ఫోన్‌ను ఏడాది క్రితం గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. అప్పుడే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి సదరు సెల్‌ఫోన్‌ను గుర్తించి, రికవరీ చేసి మంగళవారం బాధితురాలికి అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహ్మద్ అలీ, సిబ్బంది ఉన్నారు.

శంకరపట్నం, ఆగస్టు 12 : కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎండీ సహియా అనే మహిళ 5 నెలల క్రితం రూ.16,500 విలువైన స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకుంది. దొరకకపోవడంతో కేశవపట్నం సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో కేశవపట్నం ఎస్ఐ కే రవి దర్యాప్తు చేసి ఫోన్‌ను కనుక్కున్నారు. సోమవారం స్మార్ట్ ఫోన్‌ను సదరు మహిళకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

బండి సంజయ్ అభివృద్ధి చేసి చూపించాలి

- సమస్యల పరిష్కారానికి హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమం చేపట్టాలి
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు

రాంనగర్, ఆగస్టు 12 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలనాల కోసం కాంగ్రెస్‌ను విమర్శించడం మాని, తెలంగాణ, కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు హితవు పలికారు. చిల్లరగా మాట్లాడుతూ ప్రజల్లో చులకన కావద్దని, ప్రజల మెప్పు పొందేలా అభివృద్ధి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ హర్ ఘర్ తిరంగా పండుగ జరిగే సమయంలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమం చేపట్టాలని సవాల్ విసిరారు. ఎంపీగా గెలిపించిన జన్మభూమి కోసం ఏమైనా గొప్ప పని చేయాలి తప్ప, ఊరికే నేను పక్కా లోకల్ లాంటి డైలాగులు కొడితే ఏం లాభం అని మండిపడ్డారు. బండి సంజయ్ ఎంత కాలం ప్రజలు ఎదురుచూసేలా చేస్తావని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రజా సమస్యల పరిష్కారానికి హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి పుట్టిన జన్మభూమి రుణం తీర్చుకోవాలని సూచించారు. మిమ్మల్ని నమ్మి గెలిపించిన ప్రజల ఆశలు వమ్ము చేయవద్దని, వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు పోవాలని సూచించారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, ఆగస్టు 12: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 467, 654,629, 657, 887లలోని కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలని, కబ్జాలకు సహకరించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 467 ప్రభుత్వ భూమని, రూ. 10కోట్లు విలువజేసే భూమిని కొందరు కబ్జా చేశారని అందులో పేర్కొన్నారు. విలువైన భూమి చుట్టూ అధికారుల అండదండలతో ప్రహరీ నిర్మాణం చేశారని, వెంటనే సర్వే చేసి కబ్జా భూమిని కాపాడాలని కోరారు.

జీపీలకు పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి

మానకొండూర్, ఆగస్టు 12: గ్రామపంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు రూ.కోట్ల బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పెండింగ్ నిధులు మంజూరు చేయాలని, లేనియెడల ప్రజలందరినీ ఐక్యంచేసి ఉద్యమాల్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాముల నారాయణ, లంబు సంపత్‌రెడ్డి, మెట్టపల్లి శంకర్, అబ్దుల్ కరీం, ఎం రవి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఏ రాజవీరు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

రామడుగు, ఆగస్టు 12: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు అడ్మిషన్లు పొందవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రారం ప్రధానోపాధ్యాయుడు రంగనాథ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థి తాను పూర్తి చేసిన తరగతి టీసీ, ఇంటర్మీడియట్ కోసం పదో తరగతి పాస్ అయిన ధ్రువీకరణ పత్రం అందించాలని పేర్కొన్నారు. ఇంటర్ కోర్సు వ్యవధి ఒక సంవత్సరం మాత్రమే ఉన్నదని తెలిపారు. అడ్మిషన్లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుద్రారం ఫోన్ నంబర్ 9490539358లో సంప్రదించాలని కోరారు.

ఆముదాలపల్లిలో విద్యుత్ వినియోగదారుల కోర్టు

శంకరపట్నం, ఆగస్టు 12 : ఈ నెల 13, 14 తేదీల్లో ఆముదాలపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల కోర్టు నిర్వహిస్తున్నట్లు ఆముదాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ కుమారస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కరీంనగర్ రూరల్, ఆగస్టు 12: పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని శ్రీ శక్తి దేవాలయంలో గాయత్రీ పర్యావరణ సంస్థ, బొమ్మకల్ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతుల పోస్టర్లను ఆవిష్కరించారు. మట్టి గణపతుల తయారీతో పర్యావరణ పరిరక్షణకు గాయత్రీ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు తిరుపతి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల మరమ్మతులు చేపట్టాలి

కలెక్టరేట్, ఆగస్టు 12 : నగరంలో దెబ్బతిన్న అంతర్గత రహదారుల మరమ్మతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నగరశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆపార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కళ్యాడపు ఆగయ్య మాట్లాడుతూ, ముసురు వర్షాలతో రోడ్లపై నీరు నిలిచి, గుంతలు పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నదని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ధర్నాలో నాయకులు రాయమల్లు, రమేశ్, బాగయ్య, ఐలయ్య, కాయిత వెంకట్రాజం, కొలుగూరి మహేందర్, చిన్న రాజారెడ్డి పాల్గొన్నారు.

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 12: మండలంలోని చెల్పూర్, ఇందిరానగర్, రాజపల్లి, రంగాపూర్, పోతిరెడ్డిపేట, వెంకట్రావుపల్లి, సిర్సపల్లి, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగనున్నదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లబ్ధిదారుల ఇండ్ల వెళ్లి చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు.

సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు12: ఈ నెల 20న హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా జనరల్ బాడీ, నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో సోమవారం నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, సృజన్‌కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, టేకుమల్ల సమ్మయ్య, బాబు పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 12: పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న కోనోకార్పస్ మొక్కలను పట్టణంలోని రోడ్డు మధ్యలో నుంచి తొలగించాలని యునైటెడ్ ఫోరం, ఆర్టీఐ జిల్లా బాధ్యులు గూడూరి స్వామి రెడ్డి (లోక్ సత్తా), ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రచార కార్యదర్శి తులసి లక్ష్మణమూర్తి, గూడూరి చైతన్య సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. వాటికి బదులు పర్యావరణానికి మేలు చేసే మొక్కలు నాటించాలని వినతి పత్రంలో కోరారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండలాధ్యక్షుడిగా సహోదర్

సైదాపూర్, ఆగస్టు 12: పీఆర్‌టీయూ టీఎస్ మండలాధ్యక్షుడిగా గడిపె సహోదర్ ఎన్నికయ్యారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తిప్పిరిశెట్టి రమేశ్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా రామలక్ష్మి, కార్యదర్శిగా కుమారస్వామి, మహిళా కార్యదర్శిగా రజినీ ఎన్నికయ్యారు.

మాడిశెట్టికి సన్మానం

విద్యానగర్, ఆగస్టు 12 : పూణేలో జరిగిన భారతీయ జీవిత బీమా సంస్థలోని నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ (ఎన్‌వోఐడబ్ల్యూ) యూనియన్ సెంట్రల్ కమిటీ మీటింగ్‌లో కరీంనగర్ నుంచి ఏడుగురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మధ్యకాలంలో ఎన్‌వోఐడబ్ల్యూ సాధించిన విజయాల గురించి చర్చించారు. అలాగే ఈ సమావేశంలో ఎంప్లాయీస్ సమస్యల గురించిన వివిధ తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా కరీంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి గోపాల్‌ను సమావేశంలో ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు కే రఘువీర్ రెడ్డి, ట్రెజరర్ రవీంద్రాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, పోచయ్య, రాజ మల్లయ్య, రాజేశం పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంపై అవగాహన

సైదాపూర్, ఆగస్టు 12: మండలకేంద్రంలోని రైతువేదికలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పాడి పశువుల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం వంగ రవీందర్, ఏపీఎం కుమారస్వామి మాట్లాడుతూ, పాడిపశువుల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి ప్రభుత్వం నుంచి పశువుకు రూ.93,270 చొప్పున బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. పశువైద్యాధికారి విజేందర్‌రావు, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ అశ్విని, ఏఈవో నిఖిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్, ఆగస్టు 12: మహిళా శక్తి పథకంలో భాగంగా పాడిపశువుల పెంపకం కోసం రుణం మంజూరైన మహిళా సంఘాల సభ్యులకు మండల కేంద్రంలోని రైతువేదికలో 'పశు పోషణ- పెంపకం'పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మండల పశువైద్యాధికారి డాక్టర్ అరవింద్‌రెడ్డి హాజరై, మేలు జాతి పశువుల ఎంపిక, పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎంలు నిరంజన్, సంతోష్‌రావు, సీసీ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఘనంగా స్వాగతోత్సవం

చొప్పదండి, ఆగస్టు 12: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో సోమవారం నూతన విద్యార్థుల స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ అలివేలు, దీప్తి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి, ఆగస్టు 12: తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ రాష్ట్ర జేఏసీ ముఖ్య సలహాదారు, ఎస్ఎస్ఏ జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి, ఎంఐఎస్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో సమగ్ర శిక్షా ఉద్యోగులతో కలిసి మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ భద్రత లేక నిరాశ నిస్పృహకులోనై మరణించిన ఉద్యోగులకు మౌనం పాటించి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఐఈఆర్‌పీలు శ్రీనివాస్, పద్మ, సీఆర్‌పీలు శ్రీనివాస్, అశోక్, వీరేశం, సురేందర్, పీటీఐలు గోపాల్, చంద్రశేఖర్, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వీణవంక/ చిగురుమామిడి/ సైదాపూర్, ఆగస్టు 12: ఆదర్శ, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా మండల విద్యాధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వీణవంక మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ (1), స్వీపర్ కమ్ స్కావెంజర్ (1), తెలంగాణ ఆదర్శ పాఠశాలలో హెడ్ కుక్ (1), అసిస్టెంట్ కుక్ (1), కేర్ టేకర్ (1) పోస్టులు ఖాళీగా ఉన్నాయని మండల విద్యాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో స్వీపర్, వాచ్‌మెన్, చిన్నముల్కనూర్‌లోని మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎంఈవో కొమ్మర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలం ఆకునూర్ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ పోస్టు, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణులు అర్హులు కాగా, జీతం నెలకు రూ.9,750 ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఆదర్శ పాఠశాలలో హెడ్ కుక్ పోస్టు కోసం 10వ తరగతి ఉత్తీర్ణులు అర్హులు కాగా, జీతం నెలకు రూ.7,800 ఉంటుందని, అసిస్టెంట్ కుక్ (1) పోస్టు కోసం పదో తరగతి ఉత్తీర్ణుల అర్హులు కాగా, జీతం నెలకు రూ.6500, వాచ్‌మెన్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు కాగా, జీతం రూ.9,750, కేర్ టేకర్ పోస్టుకు ఏదేనా డిగ్రీతో పాటు బీఎడ్, టీటీసీ అండ్ కంప్యూటర్ సర్టిఫికెట్ కలిగి ఉన్నవారు అర్హులుకాగా, జీతం నెలకు రూ.12500 ఉంటుందని పేర్కొన్నారు. కాగా, అన్ని పోస్టులకు ఆయా మండలానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని, వీణవంకకు చెందిన వారు ఈ నెల 14లోగా, చిగురుమామిడి, సైదాపూర్‌కు చెందిన అభ్యర్థులు ఈ నెల 16, సాయంత్రం 5 గంటల్లోగా ఆయా మండల కేంద్రాల్లో ఎంఆర్‌సీలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు సూచించారు.